క్లుప్తంగా

పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలి

పుంగనూరు: విశ్రాంత ఉద్యోగుల పీఆర్‌సీ, డీఆర్, పీఎఫ్, టీఎఫ్, ఏపీజీఎల్‌ఐ బకాయిలు చెల్లించాలని సంఘ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గురురాజారావు , తిరుపతి జిల్లా అధ్యక్షుడు కె.ఆర్.శంకర్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ కార్యాలయంలో అధ్యక్షుడు చెంగారెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. గురురాజారావు మాట్లాడుతూ ప్రభుత్వం బకాయిలు చెల్లించాలని, వీహెచ్‌ఎస్ పటిష్టంగా అమలు చేయాలని కోరారు. అలాగే తగ్గించిన అదనపు పెన్షన్లను తిరిగి పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు సుకుమార్‌బాబు, భరత్‌భూషణ్, రామకృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, కేశవరెడ్డి, ఈశ్వర్ కుమార్‌రెడ్డి, రెడ్డెమ్మ, లీలావతమ్మ, చంద్రశేఖరం, రెడ్డికుమారి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను పెంచుదాం


డిగ్రీ కళాశాల వద్ద మొక్కలను నాటుతున్న కళాశాల బృందం

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నవ మహోత్సవం సందర్బం మొక్కలను నాటారు. కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశులు మాట్లాడుతూ, పెరుగుతున్న భూతాపానికి కారణం పచ్చదనం తగ్గిపోవడమే కారణమన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని మొక్కలు నాటడం బాధ్యతగా పెట్టుకోవాలని, మానవాళి మనుగడ పర్యావరణం పరిరక్షణపైనే ఆధారపడి ఉందని అందరూ గ్రహించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ షణ్ముగం, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

మాల మహానాడు జిల్లా అధ్యక్షుడిగా చంద్రకుమార్

పలమనేరు: మండలానికి చెందిన చంద్రకుమార్ మాల మహానాడు జిల్లా అధ్యక్షునిగా ఎంపికైనట్లు సోమవారం తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు చెన్నయ్య తనను ఏకగ్రీవంగా ఎంపిన చేసినట్టు ఆయన పేర్కొన్నారు.

ఘనంగా రాహుకేతు పూజలు


మొగిలి శివాలయంలో రాహుకేతు పూజల్లో భక్తులు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలను ఘనంగా నిర్వహించారు. స్వయంభు శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి మూలవర్లకు ఉదయం అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు చేశారు. ప్రత్యేక పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని దోష నివారణ చేసుకున్నారు. అనంతరం మొగిలీశ్వరస్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మునిరాజు, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం


విరాళం అందజేస్తున్న కర్నూలు వాసులు

కాణిపాకం: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలోని అన్నదానం ట్రస్టుకు సోమవారం కర్నూలుకు చెందిన రుద్రనాథ్ కుటుంబం రూ.1,00,116 విరాళంగా అధికారులకు అందజేసింది. అనంతరం దాత కుటుంబానికి స్వామి దర్శన భాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, సిబ్బంది వాసు, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

మామిడిలో సేంద్రియ పద్ధతులపై అవగాహన


మామిడి రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ గంగాధర్

ఐరాల: సేంద్రియ పద్ధతుల్లో మామిడితోటలను పెంచితే చెట్లకు పురుగులు, తెగుళ్లను తట్టుకునే రోగ నిరోధకశక్తి పెరుగుతుందని డాక్టర్ గంగాధర్, ప్రకృతి వ్యవసాయ రైతు ఆనందనాయుడు పేర్కొన్నారు. మండలంలోని పుత్రమద్దిలో సోమవారం మామిడి సాగు చేసే రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ, రైతులకు సాగు ఖర్చులు తగ్గి అధిక దిగుబడులు, ఆదాయం చేకూరుతుందని తెలిపారు.

సారూ..ఆఫీసుకు ఎప్పుడొస్తారు మీరు?

- కుప్పంలోనే గుడుపల్లె తహసీల్దార్ పాలన!
- చుట్టపు చూపుగా కార్యాలయానికి వస్తున్న వైనం
- కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న ప్రజలు


ఖాళీగా ఉన్న తహసీల్దార్ కుర్చీ, టేబుల్‌పై కూటమి నేతలు ఉంచిన సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలు

గుడుపల్లె: ఎన్నికల విధులకు నియమితులైన తహసీల్దార్ సయ్యద్ షాబుద్దీన్ గుడుపల్లె కార్యాలయాలని చుట్టపు చూపుగా వచ్చి వెళ్తున్నారనే విమర్శలొస్తున్నాయి. ప్రతి సోమవారం అధికారులు తమ కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలి. అయితే ఇక్కడ తహసీల్దార్ కార్యాలయం దీనికి భిన్నంగా ఉంటోంది. తహసీల్దార్ కుర్చీ ఎప్పుడు చూసినా ఖాళీగా దర్శనమిస్తూ ఉండడంతో ఆయన ఎప్పుడొస్తారో తెలియక వివిధ పనుల నిమిత్తం ప్రదక్షిణలు చేయాల్సి వస్తోందని మండల ప్రజలు వాపోతున్నారు. ఎన్నికల సమయంలో సమావేశాల పేరిట ఎక్కువ కాలం కుప్పంలోనే తహసీల్దార్ మకాం వేశారు. అక్కడే ఒక గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నారు. రెండు మూడు రోజులకోసారి మాత్రం కార్యాలయానికి వచ్చి సర్టిఫికెట్లకు మాత్రం కీ పెట్టి వెళ్లిపోతున్నారు. ఎన్నికలు పూర్తయి నెల గడుస్తున్నా కూడా ఆయన కుప్పం వీడి గుడుపల్లెకు రావడం లేదు. రైతులు తమకు ఏవైనా రెవెన్యూ సంబంధిత పనులు ఉంటే సంబంధిత అధికారి ద్వారా కుప్పంకు వెళ్లి పనులు చేయించుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. పాలనా వ్యవహారాలన్నీ కుప్పంలో ఉంటున్న గది నుంచే ఆయన నిర్వర్తిస్తున్నారని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.

గుట్టుచప్పుడు కాకుండా రెవెన్యూ పనులు?

గుట్టుచప్పుడు కాకుండా రెవెన్యూ సంబంధించిన మ్యుటేషన్లు, డీకేటీ భూములు మార్పులు-చేర్పులు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కానీ తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న వారికే తెలియకుండా ఈ పనులన్నీ కుప్పంలో చేస్తున్నారని ప్రచారంలోకి వచ్చింది. చేయి తడిపితే డీకేటీ భూముల విషయంలో మార్పులు-చేర్పులు చేస్తున్నారని ఆరోపణలు గుప్పుమంటున్నాయి. తమ అనుభవంలోనే ఉన్నాయి కాబట్టి డీకేటీ భూములు ఎప్పటికైనా తమకే చెందుతాయనే ధైర్యంతో కొందరు ఉంటున్నారు. మరికొందరేమో కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం లేకపోవడంతో మిన్నకుండిపోయారు. ఏప్రిల్ నుంచి నూతనంగా కొనుగోలు చేసి భూములు పట్టాదారు పాస్తకాలు కోసం మ్యుటేషన్‌కు ఇంకా రైతులు పెట్టుకోలేదు. తహసీల్దార్ ఎప్పుడు వస్తారో, వెళ్తారో తెలియని పరిస్థితి వల్ల వివిధ సమస్యలపై కార్యాలయానికి వచ్చే ప్రజలు నిరాశతో వెనుదిరగాల్సి వస్తోంది. ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించి తహసీల్దార్ ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

తహసీల్దార్ టేబుల్‌పై సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలు

ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చిత్రపటాలను కూటమి నేతలు తహసీల్దార్ కార్యాలయంలో పెట్టేందుకు సోమవారం తీసుకువచ్చారు. అయితే గంటల తరబడి ఎదురుచూసినా తహసీల్దార్ రాకపోవడం..సిబ్బందిని ప్రశ్నిస్తే ఆయన ఎప్పుడు వస్తారో తమకు సమాచారం లేదని చెప్పడంతో చేసేదేమీ లేక ఆ ఫొటోలను తహసీల్దార్ టేబుల్‌పై పెట్టి వెనుతిరిగారు.

టీచర్లు ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ లీలారాణి

పలమనేరు: సమాజ అవసరాలు, మారుతున్న ట్రెండ్‌కు అనుగుణంగా టీచర్లు సైతం పాఠ్యాంశాల బోధనలో ఎప్పటికప్పుడు అప్‌డేట్‌లో ఉండాలని పలమనేరు ఎంఈఓ లీలారాణి అన్నారు. స్థానిక ఎమ్మార్సీలో సోమవారం టీచ్ టూల్ మూడో దశ శిక్షణా కార్యక్రమం మొదలైంది. ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయుల్లో బోధనా సామర్థ్యాలు మరింత మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ఈ నెల పదవ తేదీ వరకు ఇచ్చే శిక్షణలో వివిధ అంశాలను గ్రహించి, టీచర్లు సమర్థతతో పాఠాలు బోధించాలన్నారు. కార్యక్రమంలో ఏఎల్‌ఎస్ కో-ఆర్డినేటర్ అజయ్‌కుమార్, ఎంఈఓ-2 బాలసుందరం, రిసోర్స్‌పర్సన్లు, పలమనేరు, పెద్దపంజాణి, పుంగనూరు, గంగవరం, సదుం, సోమల మండలాలకు చెందిన 120మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన ర్యాలీ


సదుం: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు


బైరెడ్డిపల్లె : ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

సదుం: కలుషిత నీటిని తాగితే అనారోగ్యం బారిన పడతారని చెరుకువారిపల్లె పీహెచ్‌సీ డాక్టరు గిరీషా అన్నారు. ప్రస్తుత సీజన్‌లో నీటిని కాచి వడబోసి తాగడమే శ్రేయస్కరమని చెప్పారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ, ఆగస్టు వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఐదేళ్ల లోపు చిన్నారులను గుర్తించి, తల్లులకు డయేరియాపై అవగాహన కల్పించి, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజశేఖర్ బాబు, తహసీల్దారు నారాయణస్వామి, వైద్య సిబ్బంది నీలకంఠ, శిఖామణి, సీహెచ్‌ఓలు దీప, శ్రావణి, సిబ్బంది హేమలత పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె, తీర్థం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారులు విజయ్‌చంద్ర, అరుణ్‌కుమార్ మాట్లాడారు. పిల్లలకు ఎక్కువ సార్లు విరోచనాలు అయితే అతిసారం విజృంభించే అవకాశం ఉందన్నారు. పిల్లలకు విటమిన్-ఏ సిరప్ తాగించాలన్నారు. తల్లి పాల ప్రాముఖ్యతను వివరించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం గ్రామ వీధుల్లో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్లు సావిత్రమ్మ, కాంతమ్మ, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎవరూ అధైర్యపడొద్దు


మున్సిపల్ నాయకులతో సమావేశమైన మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ

- మనకూ మంచి టైమ్ వస్తుంది!
- ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటా
- మున్సిపల్ నాయకుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ


పట్టణంలోని టీకొట్టులో నాయకులతో కలిసి టీ తాగుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: వైఎస్సార్‌సీపీ శ్రేణులు అధైర్యపడరాదని, మనకూ మంచి సమయం వస్తుందని.. అంతవరకూ అన్నిటినీ తట్టుకుని ముందుకుపోవాలని పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ క్యాడర్‌కు దిశానిర్దేశం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల ఫలితాల తర్వాత పట్టణంలో చోటుచేసుకున్న రాజకీయాలు, వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు, నాయకులపై కూటమి నేతల కక్ష సాధింపు చర్యల గురించి చర్చించారు. ఇటీవల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి 1.20 లక్షల ఓట్లు వచ్చాయని, రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా అధికారం అడ్డుపెట్టుకుని కూటమి నేతలు చేస్తున్న పనికట్టుకుని చేస్తున్న దౌర్జన్యాలు, విధ్వంసాలు చూసి ప్రజల్లో కూడా ఆలోచన మొదలైందన్నారు. ఇక్కడి ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా తాను అండగా నిలబడతానన్నారు. అనంతరం ఆయన పార్టీ కార్యాలయం నుంచి నాయకులతో కలసి పట్టణంలో కలియ తిరుగుతూ గుడియాత్తం రోడ్డులోని ఓ టీకొట్లో అందరితో కలసి టీ తాగారు. అందరూ ధైర్యంగా ఉండాలన్నారు. ప్రజలకు ఎవరు మేలు చేశారో ఆ దేవుడే చూసుకుంటారన్నారు. ఆయన వెంట పట్టణ కన్వీనర్ జాఫర్, మాజీ కన్వీనర్ మండీ సుధా, రాజేష్, నరేష్, మల్లీశ్వర్‌రెడ్డి, షరీఫ్, నాగరాజ్, వీరభద్ర, సీఎస్ నవీన్, అప్జల్, ఎర్రబల్లి శీనా తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ


ప్రభుత్వ వైద్యులను సన్మానిస్తున్న హెల్త్ ప్రొవైడర్స్

పలమనేరు: డాక్టర్స్‌డే సందర్భంగా పట్టణంలోని పారామెడికల్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ అసోసియేషన్ సోమవారం పట్టణంలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించింది. అనంతరం స్థానిక బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహ కార్యక్రమంలో వైద్యులు మాట్లాడారు. క్యాన్సర్ వ్యాధి వస్తుంది? దాని లక్షణాలు, నివారణ మార్గాలను వారు విపులంగా వివరించారు. ప్రస్తుతం స్థానికంగా అతిసారం ప్రబలుతోందందని, దీని బారిన పడకుండా ఉండేందుకు పరిశుభ్రమైన నీటినే తాగాలని సూచించారు. విష జ్వరాలు ఉన్న కారణంగా ఎలాంటి జ్వరమొచ్చినా వెంటనే ప్రభుత్వాసుపత్రికి వెళ్లి వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం వైద్యులను సన్మానించారు. కార్యక్రమంలో పట్టణంలోని ఏరియా ఆస్పత్రి, అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్యులు, మెడికలాఫీసర్లు మల్లికార్జున రెడ్డి, శ్రీనివాస్, ఆశా వర్కర్ల అసోసియేషన్ నేతలు జనార్దన్, మనోహర్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవల్లో అగ్రగామి ఎల్‌ఐసీ


పుత్తూరులో యూనియన్ జెండాను ఎగురవేస్తున్న నాయకులు

పుత్తూరు: ప్రజలకు మెరుగైన సేవలందించడంలో దేశంలోని అగ్రగామి సంస్థల్లో ఎల్‌ఐసీ ఒకటని అఖిలభారత భీమా ఉద్యోగుల సంఘం (ఏఐఐఈఏ) పుత్తూరు శాఖ కార్యదర్శి ఎస్.లక్ష్మణకుమార్ అన్నారు. సోమవారం సంఘ ఆవిర్భావ దినోత్సవాన్ని బ్రాంచి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తొలుత యూనియన్ ఉపాధ్యక్షుడు జి.వెంకటేష్ యూనియన్ జెండాను ఎగురవేశారు. లక్ష్మణకుమార్ మాట్లాడుతూ, ప్రతి ఏటా యూనియన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 2న ప్రభుత్వ ఆస్పత్రులోని రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ, 3వ తేదీ ఉచిత మెగా మెడికల్ క్యాంపు, 5న బ్రాంచ్ కార్యాలయం వద్ద రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ఎల్‌ఐసీ, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

భాగ్యవతి దశ దిన కర్మకు హాజరైన మాజీ ఎమ్మెల్యే


భాగ్యవతి చిత్రపటానికి నివాళుర్పిస్తున్న వెంకటేగౌడ

పలమనేరు: మండల సర్పంచుల సంఘ అధ్యక్షుడు, మొరం సర్పంచ్ విశ్వనాథ రెడ్డి సతీమణి భాగ్యవతి దశదిన కర్మకు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ సోమవారం హాజరై ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని కోరారు. కార్యక్రమంలో మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ నాయకులు, కార్యకర్తలు, మండలంలోని ఆయన అభిమానులు పాల్గొన్నారు.

8న ఆలయ భూములు కౌలు వేలం

బంగారుపాళెం: మండలంలోని మొగిలీశ్వరస్వామి ఆలయ భూములు కౌలు వేలం ఈ నెల 8వ తేదీ నిర్వహించనున్నట్లు ఈఓ మునిరాజులు సోమవారం తెలిపారు. మొగిలి, 170 గొల్లపల్లె, టేకుమంద, ఊటువంక గ్రామాల్లో గల ఆలయ భూములను 2024-25 నుంచి 2026-27 సంవత్సరం వరకు మూడేళ్లకు కౌలుకు ఇస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటలకు ఆలయ ఆవరణలో కౌలు వేలం ప్రారంభం అవుతుందన్నారు. రూ.3 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు. వివరాలకు ఆలయ కార్యనిర్వహణాధికారి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

సూపర్ సిక్స్ అమలు చేస్తాం


పలమనేరు: పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే


గుడుపల్లె: పింఛన్లు పంపిణీ చేస్తున్న శ్రీకాంత్

- పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి

పలమనేరు/బైరెడ్డిపల్లె: ఎన్నికల సమయంలో పింఛనుదారులకు ఇచ్చిన మాటను తమ ప్రభుత్వం నిలబెట్టుకుందని ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి అన్నారు. పలమనేరు మున్సిపాలిటీలోని బొమ్మిదొడ్డిలో సోమవారం ఆయన పింఛన్లు పంపిణీ చేసి మాట్లాడారు. మాట ప్రకారం పెంచిన పెండింగ్ వెయ్యితోపాటు ఈనెల 4వేలను కలిపి మొత్తం రూ.7వేల పింఛను ఇస్తున్నామన్నారు. మున్సిపాలిటీలోని 4,862 పింఛన్లకు సంబంధించి 93 శాతం, అలాగే మండలంలో 4,577కు సంబంధించి 90శాతం మందికి పింఛన్లు పంపిణీ చేసినట్టు పేర్కొన్నారు. టీడీపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట మేరకు సూపర్‌సిక్స్ పథకాలను కూడా అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కుట్టి, ఆర్వీ బాలాజీ తదితరులు పాల్గొన్నారు. ఇక, ఆయా వార్డుల్లో వార్డుల టీడీపీ లీడర్లు సచివాలయ సిబ్బందితో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. అలాగే బైరెడ్డిపల్లె మండలంలో టీడీపీ నాయకులు పింఛన్లు పంపిణీ చేశారు.

పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్సీ

కుప్పం/గుడుపల్లె: కుప్పం మండలంలోని లక్ష్మీపురంలో, అలాగే గుడుపల్లె మండలం మల్లేపల్లెలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పింఛన్లు పంపిణీ చేశారు. ప్రతి నెలా 1వ తేదీనే సచివాలయ ఉద్యోగులతో ఇళ్ల వద్దనే పింఛన్లు ఇస్తామని ఆయన అన్నారు. టీడీపీ మున్సిపల్ అధ్యక్షులు రాజ్‌కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి రవి, ప్రతాప్, గుడుపల్లెలో మండల టీడీపీ అధ్యక్షుడు బాబునాయులు, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు నియోజకవర్గం

పుంగనూరు/చౌడేపల్లె/సదుం/రొంపిచెర్ల/: పుంగనూరు మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు సోమవారం పింఛన్లు పంపిణీ చేశారు. సాయంత్రానికి 93 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి చేసినట్లు కమిషనర్ తెలిపారు. చౌడేపల్లె మండలంలోని గోసలకురప్పల్లెలో సచివాలయ సిబ్బందితో పాటు ఇంటింటికీ వెళ్లి మండల టీడీపీ అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి, నేతలు ప్రదీప్‌రాజు, రామచంద్ర పెన్షన్లు పంపిణీ చేశారు. తొలిరోజు, 93.93 శాతం పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీఓ శివప్రసాద్ తెలిపారు. సదుం మండలంలో సచివాలయ సిబ్బందితో కలిసి టీడీపీ నాయకులు గ్రామాలలో పింఛన్లు పంపిణీ చేశారు.అలాగే రొంపిచెర్ల మండలంలో సామాజిక భద్రత పెన్షన్లను పంపిణీ చేశారు. బొమ్మయ్యగారిపల్లె గ్రామ పంచాయతీలో టీడీపీ నాయకులు పింఛన్లు పంపిణీ చేశారు.

ప్రజా ఫిర్యాదులపై నిర్లక్ష్యం వద్దు


ప్రజల సమస్యలు వింటున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై నిర్లక్ష్యం వద్దని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్‌డేను నిర్వహించారు. ఇంజినీరింగ్, ప్రజారోగ్యం, మెప్మా విభాగాలకు సంబంధించి పలు వినతులను బాధితులు అందజేశారు. వీటిపై విచారణ చేసి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రజారోగ్యశాఖ అధికారి డాక్టర్ అనీల్‌కుమార్ నాయక్, రెవెన్యూ అధికారి గోపాల కృష్ణవర్మ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల వితరణ

చౌడేపల్లె: మండలంలోని మేకలచిన్నేపల్లె ఉన్నత పాఠశాలలో 2004-2005 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు సమాజ సేవలో ఆదర్శనీయంగా నిలిచారని హెచ్ఎం నీరజ ప్రశంసించారు. సోమవారం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో 55 మంది విద్యార్థులకు పూర్వ విద్యార్థులు బోధన సామగ్రిను వితరణ చేశారు. నోట్ పుస్తకాలు, పెన్నులు, జామిట్రీ బాక్స్‌లు, బ్యాగులు, వాటర్ బాటిళ్లు, ఆట పరికరాలు, డిజిటల్ డిస్‌ప్లే బోర్డులు..ఇలా సుమారు రూ.70 వేల విలువ చేసే వాటిని అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు అమృత, అంగన్‌వాడీ కార్యకర్త మునీశ్వరి, హెల్పర్ శ్రావణి, పూర్వ విద్యార్థులు ప్రదీప్‌రాజు, ప్రవీణ్, బి.సుబ్రమణ్యం ,రాఘవేంద్రరాజు, మంజునాథ్, సర్దార్, సురేష్, కుమార్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


మేకలచిన్నేపల్లెలో పూర్వ విద్యార్థులు అందజేస్తున్న విద్యాసామగ్రి

సబ్‌స్టేషన్ల వారీగా సమస్యల పరిష్కారం


అధికారులతో సమీక్షిస్తున్న ఈఈ హరి

చిత్తూరు కార్పొరేషన్: సబ్‌స్టేషన్ల వారీగా సమస్యలను పరిష్కరించాలని ట్రాన్స్‌కో రూరల్ ఈఈ హరి ఆదేశించారు. రూరల్ ఈఈ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి సబ్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఇది ప్రతివారం కొనసాగుతుందన్నారు. అందులో సమస్యలను నమోదు చేసి వాటిని పరిష్కరించి నివేదికను ఉన్నతాధికారులకు పంపాలని చెప్పారు. సబ్‌స్టేషన్ శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. 4న విద్యుత్ అదాలత్ కార్యక్రమం పైపల్లె సబ్‌స్టేషన్‌లో నిర్వహించనున్నట్టు చెప్పారు. వందశాతం విద్యుత్ బిల్లుల వసూళ్లు చేయాలని ఆదేశించారు. పల్లెల్లో ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురైతే సకాలంలో మార్పు చేయాలన్నారు. ఫీడర్ల వారీగా లైన్ల నిర్వహణ చేయాలన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలని ఆదేశించారు. వ్యవసాయ సర్వీసుల మంజూరులో జాప్యం చేయరాదన్నారు. కార్యక్రమంలో ఏఈలు, సబ్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.